క్లుప్తంగా

సమష్టి కృషితోనే కేసుల పరిష్కారం

- విశాఖ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు



జీఆర్‌పీ పోలీసులకు సూచనలు చేస్తున్న రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

విజయనగరం క్రైమ్: సమష్టి కృషితోనే కేసులు పరిష్కరించుకోగలుగుతామని విశాఖ రైల్వే ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో ఉన్న జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఆర్‌పీ పోలీసులు, ఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి సమష్టిగా పనిచేయాలన్నారు. దొంగతనాల నివారణతో పాటు నిషేధిత గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అదేవిధంగా రైళ్లలో సిబ్బంది నిఘా పెంచాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పూసపాటిరేగ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రెల్లివలస పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ అన్నారు. మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమలు త్వరితంగా వ్యాప్తి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. సాధారణ వ్యాధులతో పాటు కండ్లు కలకలు ఎక్కువగా వ్యాపిస్తున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

సేవలు మరువలేనివి..



అబ్దుల్‌వాహబ్‌ను సన్మానించి, మెమొంటో అందిస్తున్న కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ

డెంకాడ: ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కె.అబ్దుల్ వాహబ్ సేవలు మరువలేనివని బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. బెటాలియన్ ఫంక్షన్ హాల్‌లో వాహబ్ సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు డి.మురళీకుమార్, వి.నారాయణరావు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి ఏడాది..



మాట్లాడుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొండబాబు

విజయనగరం టౌన్: నగరంలోని పెద్దచెరువు ఒడ్డున ఉన్న విజయసాగర దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి నిత్య అన్న సంతర్పణ కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొండబాబు, అధ్యక్షులు దవడ మీనా, కార్యదర్శి స్రవంతి అన్నారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వాతి, ప్రణీత, వసుంధర, హాసిని, శైలు, నవ్యశ్రీ, చైత్రశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ పంపిణీ

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సోమవారం ఉపకరణాలు అందజేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి చేతులమీదుగా ఈ కార్యక్రమం జరిగింది. గరివిడి మండలం భోగవలస గ్రామానికి చెందిన దివ్యాంగుడు తాళ్లవలస గురునాయుడుకు రూ. 7 వేల విలువగల వీల్‌చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎ.డి జీబీవీ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

31న 'సంచార జాతుల స్వాతంత్య్ర దినోత్సవం'

విజయనగరం అర్బన్: రాజమండ్రిలో ఆగస్టు 31న 'సంచార జాతుల స్వాతంత్య్ర దినోత్సవాన్ని' నిర్వహిస్తామని ఏపీ ఎంబీసీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న తెలిపారు. పట్టణంలోని ఓ హోటల్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ప్రతి జిల్లా కేంద్రంలోనూ జిల్లా స్థాయిలో దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. సంచార, అర్ధసంచార తదితర జాతులకు రక్షణ కోరుతూ కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశామన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో 56 కులాలకు కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి పెద్దపీటవేశారన్నారు.

సంక్షేమమే జగనన్న ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 49వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



విజయనగరం: లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి , తదితరులు

విజయనగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వారి ఇళ్ల వద్ద అందించడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం ఉదయం నగరంలోని 49వ డివిజన్ గాజులరేగ గుభేల్‌పేట నుంచి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను వివరించారు. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే కోలగట్ల దృష్టికి తీసుకురాగా... వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ, నగరంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను నేరుగా ప్రజల ఖాతాలకే జమ చేస్తున్నారన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమస్యలు లేని డివిజన్‌లుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని తెలిపారు. డిప్యూటీ మేయర్ లయాయాదవ్ మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాన్యాల కృష్ణ, కణుగుల రాజా, పీఏసీఎస్ అధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా వెలుగులు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రామతీర్థం సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఇంటింటా పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వ హయాంలో ఎటువంటి లబ్ధి పొందని తాము... ప్రస్తుత పాలనలో అర్హులమయ్యామంటూ అర్చకుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఏపీలో జనరంజక పాలన కొనసాగుతోందని చెప్పారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు మంచి మనసుతో ఆహ్వానం పలుకుతున్నారని, సంక్షేమ పాలనలో భాగస్వామ్యమైనందుకు గర్వపడుతున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తమకు మద్దతు పలకాలని కోరారు.

అందరికీ లబ్ధి: ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, సీఎం జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ అర్హతే ప్రామాణికంగా నవరత్నాల పథకాలు వర్తించాయని, ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పచ్చచొక్కా వేసుకుంటేనే పథకాలు వర్తించేవని.. నేడు ఆ పరిస్థితి ఎక్కడా లేదన్నారు. ఎవరికీ లంచం ఇచ్చే పరిస్థితి లేకుండా పథకాల సొమ్ము నేరుగా అక్క, చెల్లెమ్మల ఖాతాల్లోనే పడుతోందని తెలిపారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, రైల్వే బోర్డుమెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠనాయుడు, సర్పంచ్ కంచరాపు సూర్యకళ, ఎంపీటీసీ సభ్యురాలు తర్లాడ జయమ్మ, నాయకులు మత్స శ్రీనివాసరావు, కంచరాపు రాము, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

అభివృద్ధి పనులతో సమస్యలకు చెక్



42వ డివిజన్‌లో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: శంకుస్థాపన మహోత్సవాల పేరిట విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలతో ఆయా ప్రాంతాల్లో సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 42వ డివిజన్‌లో రూ. 36 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని కంటోన్మెంట్, శాంతినగర్ ప్రాంతాల్లో రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లనాటి సమస్యలను కూడా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక దృష్టితో పరిష్కరిస్తూ నగరాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తున్నారన్నారు. తమ ప్రాంతంలో చాలా కాలంగా రహదారి సమస్య ఉన్నప్పటికీ పరిష్కారం కాలేదని.. పరిస్థితి తెలుసుకుని రహదారి నిర్మాణానికి చొరవ చూపడం అభినందనీయమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్యలను గుర్తించి రూ.20 లక్షలతో కాలువలు, రహదారులను తమ డివిజన్‌లో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

- డీఎస్పీ గోవిందరావు



సీఐ విజయనాథ్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ గోవిందరావు, తదితరులు

భోగాపురం: అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే గుర్తింపు లభిస్తుందని డీఎస్పీ గోవిందరావు అన్నారు. ఇటీవల భోగాపురం సర్కిల్‌లో పనిచేసి బదిలీపై విశాఖపట్నం రేంజ్‌కు వెళ్లిన సీఐ కేకేవీ విజయనాథ్‌ను ఆదివారం రాత్రి మండలంలోని రాజాపులోవ వీఆర్ ఫంక్షన్ హాల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గోవిందరావు మాట్లాడుతూ, ఎన్నాళ్లు ఉద్యోగం చేశాం అని కాకుండా.. ఎంత నిబద్ధతతో పనిచేశామన్నదే ముఖ్యమన్నారు. భోగాపురం సర్కిల్ ప్రశాంతంగా ఉండడంలో విజయనాథ్ సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో సీఐ బీవీ వెంకటేశ్వరరావు, ఎస్సైలు కృష్ణమూర్తి, నారాయణరావు, నరసింగరావు, శ్రీనివాసరావు, పద్మావతి, జయంతి, సూర్యకుమారి, ఏఎస్సైలు టీఎస్ఎన్ రాజు, తవుడు, అప్పారావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



తహసీల్దార్ రమణరాజును సన్మానిస్తున్న డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

నెల్లిమర్ల రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపునిస్తాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని జరజాపుపేట గ్రామంలో తహసీల్దార్ కేవీ రమణరాజు స్వచ్ఛంద పదవీ విరమణ సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోలగట్ల స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి రమణరాజును సత్కరించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, రమణరాజు చిన్నప్పటి నుంచి మంచి స్నేహితుడని, విధి నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, రమణ రాజు ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ స్థాయికి ఎదిగి మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. రెవెన్యూ అసోషియేషన్ కార్యదర్శిగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, రైల్వేబోర్డు సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణ, పార్టీ పట్టణ, గ్రామీణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నేతలు మత్స సత్యనారాయణ, రేగాన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిద నారాయణపట్నంలో సుమారు రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్లు, మరో రూ.5 లక్షలతో నిర్మించనున్న శ్మశానవాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పెనుమత్స మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివన్నారు. గత ప్రభుత్వంలో రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలతోనే సరిపెట్టారని, నేడు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసి శిలా ఫలకాలను ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో రైతుభరోసా, సచివాలయం, వెల్‌నెస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఉన్న గ్రామంలోనే ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ఎన్నికల లబ్ధికోసం లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా వెల్‌నెస్ కేంద్ర భవనం

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ గ్రామంలో రూ.17.5 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ కేంద్ర భవనం పూర్తయింది. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల పరిధిలో వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. మరికొద్ది రోజుల్లో ఈ భవనం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. వెల్‌నెస్ సెంటర్ ప్రారంభమైతే 24 గంటలూ వైద్యసేవలు అందుతాయని పలువురు చెబుతున్నారు.



నిర్మాణం పూర్తి చేసుకున్న వెల్‌నెస్ కేంద్రం

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: బాలల అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు సూచించారు. ప్రపంచ మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక కస్పా పాఠశాలలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, బాలికలు మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. కొంతమంది వ్యక్తులు మోసపూరిత మాటలు చెప్పి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించి వారిని అసాంఘిక కార్యకలాపాలకు, అవయవ మార్పిడికి ఉపయోగిస్తున్నారన్నారు. అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, యాళ్ల నాగరాజు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు మీనా, అనిల్, చప్ప అరుణ్‌కుమార్, సతీష్, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

మీనామృతంతో మేలు

భోగాపురం: మీనామృతం వ్యవసాయానికి ఎంతో మేలు చేకూర్చుతుందని ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ కార్యకర్త పీవీ గురుమూర్తి అన్నారు. మండలంలోని లింగావలస, పోలిపల్లి గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చేపల వ్యర్థాలతో మీనామృతం చేయు విధానంపై మహిళ సంఘాల సభ్యులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన మీనామృతం వాడడం వల్ల అధిక దిగుబడులు వస్తాయన్నారు. నాలుగు కిలోల చేపల వ్యర్థాలు, నాలుగు కిలోల బెల్లం కలిపి రోజుకు రెండు పూటలా 15 రోజులు కలపాలని తెలిపారు. అనంతరం ఆ మిశ్రమాన్ని వడబోసి దానికి 200 లీటర్ల నీరు, పది లీటర్ల ఆవుమూత్రం కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ మీనామృతం వినియోగం వల్ల పంటలకు చీడపీడలు, తెగుళ్లు ఆశించవన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు భారతి, వెంకటలక్ష్మి, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ కార్యకర్త గురుమూర్తి

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని, తదితరులు

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని ప్రవేశపెట్టిన పలు తీర్మానాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధిపై కౌన్సిల్‌లో ప్రధానంగా చర్చ కొనసాగింది. రూ.24 లక్షలతో ఆయా వార్డుల్లో సీసీ రహదాలు, డ్రెయిన్ల నిర్మాణాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అర్బన్ పీహెచ్‌సీలో మిగులు పనులకు సుమారు రూ. 32 లక్షలు.. పట్టణ పరిధిలో ఉన్న జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ. 4.22 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయగా.. టెండర్ల ఖరారు, పనుల విధి విధానాలపై కౌన్సిల్‌లో సభ్యులు చర్చించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, కమిషనర్ బాలాజీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు దరఖాస్తులు నిల్

విజయనగరం రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలపై ఎటువంటి అర్జీలు అందలేదని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు. మండల పరిధిలో ఏమైనా సమస్యలుంటే ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు అందించాలని కోరారు.

మొక్కలు నాటిన సత్యసాయి భక్తులు



డెంకాడ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సత్యసాయి భక్తులు

డెంకాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి భక్తులు సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండల కేంద్రానికి గుడివాడ సంతోష్ నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు భోగాపురం ఎస్ఈబీ ఎస్సై ఇ. రామకృష్ణ సోమవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్ఈబీ హెచ్‌సీ వసంత్, కానిస్టేబుళ్లు పోలినాయుడు, పరిమిళా గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

కోట్లకు ఘన సన్మానం

విజయనగరం అర్బన్: వయోజనన విద్యాశాఖ ఉప సంచాలకుడు కోట్ల సుగుణాకరరావు స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, జిల్లాలో అక్షరాస్యత అభివృద్ధికి కోట్ల చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా చిట్టిగురువులు కార్యక్రమం ద్వారా జిల్లాకి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి, ప్రధాని మోదీ చేత అభినందనలు అందుకున్నారని ప్రశంసించారు. అనంతరం కోట్ల దంపతులకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు డాక్టర్ సురేష్‌బాబు, పాలకపాటి రఘువర్మ, ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, బడుకొండ అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, డీఆర్ఓ ఎం.గణపతిరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కోట్ల కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

జరజాపుపేట యువత ఆదర్శం



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: ప్రత్యేక రోజుల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ రక్త నిల్వలను పెంచేందుకు కృషి చేస్తున్న జరజాపుపేట యువతను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. పట్టణ పరిధిలోని జరజాపుపేటలో తహసీల్దార్ రమణరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ప్రసాద్, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.